# నిజాయితీ

-కాలిపు వీరభద్రుడు

డబ్బుతో అవసరంలేని నూతన సమాజాన్ని నెలకొల్పవచ్చునని లండన్ నివాసి, ఫ్రీ ఎకానమీ కమ్యూనిటీ వ్యవస్థాపకుడు సోయిర్స్ అన్నాడు. 'డబ్బులేని లోకం' అనే శీర్షికతోవున్న ఆ వ్యాసాన్ని రామారావు చదివాడు. ఇలాంటి విషయాలంటే రామారావు ఈమధ్య ఆకర్షితుడవుతున్నాడు. డబ్బులేని లోకం సాధ్యమా అని రామారావు ఆశ్చర్యపోతున్నాడు కూడా.

ప్రస్తుతం ప్రపంచమంతా పైసా చుట్టూ పరిభ్రమిస్తున్నదని మనందరిలాగానే రామారావు విశ్వాసం కూడా. ఎందుకోగానీ సాధారణంగా అంతా అనుకునే ఈ మాటని గురించి తనూ అనుకోగానే చిన్నగా నవ్వుకున్నాడు రామారావు. తెలుగులో అరవై మార్కులు కూడా రాని తను ప్రాసతో కూడిన ఈ వాక్యాన్ని వూహించగలిగినందుకు నవ్వుకున్నాడా? ఏమో!

పేపర్లో ఆ వ్యాసాన్ని రెండురోజుల కిందటే చదివాడు రామారావు. చదివి ఆ వార్త వైపు ఆకర్షితుడయ్యాడు. అందుకు కారణం రామారావు ఆర్థిక శాస్త్రవేత్త అనీ కాదు, అలాగని జుత్తు నెరసి అనుభవజ్ఞుడైన వృద్ధుడూ కాడు. అతను రెండు రోజుల కిందటే సెకెండ్ క్లాసులో డిగ్రీ పాసయిన విద్యార్థి.

నెలరోజుల క్రిందటే తల్లిని కోల్పోయిన అనాథ.

ఇప్పుడీ లోకంలో నా అన్నవారెవరూ లేని ఏకాకి. ప్రస్తుతం తానుంటున్న పూరి ఇంటికి వారసుడు.

పూరి ఇంటికి వారసుడన్న మాటేగానీ ప్రస్తుతం అతని జేబులో పైసాకూడా లేని పేదవాడు. రామారావుకి అతని చిన్ననాడే తండ్రి చనిపోయాడు.

తల్లి కూలీనాలీ చేస్తూ పాచిపని చేస్తూ ఎలాగో రామారావుని ఇంతవరకూ చదివించగలిగింది వూళ్లోనే కాలేజీ వుంది కాబట్టి. పరీక్షలు పూర్తి అయ్యాక ఇంట్లో ఉన్నప్పుడే రామారావుకి మాతృవియోగం సంభవించింది.

తల దాచుకోవడాన్నికైనా ఆ పూరి ఇల్లు తప్ప రామారావుకి ఏ విధమైన ఆస్తీలేదు. తల్లి చనిపోతే ఆమె దహన సంస్కారాలకి ఇంట్లో వున్న ఇత్తడి పాత్రల్ని అమ్ముకోవాల్సి వచ్చింది. అప్పటికి నగదు రూపంలో ఇంట్లో వెయ్యి రూపాయలుండేవి.

ఖర్చులన్నీ పోను రామారావు చేతిలో తల్లి దినకర్మలన్నీ పూర్తయ్యేనాటికి మూడువందలు మిగిలాయి.

ప్రస్తుతం పదిహేనురోజుల నుంచి బియ్యం అవీ తెచ్చుకుని ఏదో ఇంత వండుకుని తింటున్నాడు.

ఇప్పుడతని జేబులో పైసా కూడాలేదు. ఏం తిని బతకాలి? తినడానికి ఇంత ముద్ద ఎలా వస్తుంది? ఎవరు, ఎందుకు భోజనం పెడతారు?

లోకమంతా డబ్బుతోనే నడుస్తున్నదన్న విషయం రామారావు ఇంతవరకూ ఎంతమంది నోటనో విన్నాడు. తనకి తెలియదనీ కాదు, అయితే ఆ విషయం నేడు అతని అనుభవంలోకి వచ్చింది. చేతిలో డబ్బులేని వెలితి స్పష్టంగా కనిపిస్తూ బతుకుమీద భయాన్ని కలిగిస్తున్నది. పైసా చుట్టూ ప్రపంచం పరిభ్రమిస్తున్నదన్న వాక్యం అతన్ని ఆలోచనల అలల్లో ముంచేస్తున్నది.

ఇంతవరకూ తల్లే అన్ని విషయాలూ చూసుకునేది.

అందుచేత తనకేదీ తెలిసేదికాదు. డబ్బు లేకుండా భోజనం ఎలా దొరుకుతుంది? బియ్యం, కూరలు, పప్పు, ఉప్పులెలా దొరుకుతాయి? అసలు డబ్బుల్లేకుండా వీధిలోకి వెళ్లడం సాధ్యమా? రామారావు ఆలోచిస్తున్నాడు.

ఏం చేయాలి?

ఇల్లు అమ్మేస్తే? అయితే తల దాచుకోవడానికి చోటు? కడుపులోకి ఇంత తిండి ఉన్నా లేకపోయినా ఉండడానికి ఇల్లు ఒకటి వుందికదా? ఇంకొకరి పంచన నిద్రపోవడమా? ఏ అనాథాశ్రమంలోనో ఉండాలా? రామారావుకి ఏం అర్థం కాలేదు.

సరే ఇల్లు అమ్మేస్తాను. ఏదో కొంత పైకం వస్తుంది.

అది మాత్రం ఎన్నాళ్లు వస్తుంది? అది ఖర్చు అయ్యాక ఏం చేయాలి? దారి చూపించమని మనసులోనే దేవుడ్ని ప్రార్థిస్తున్నాడు రామారావు.

పనీపాటా లేకుండా ఇంట్లో సోమరిగా కూర్చున్నవాళ్లకి ఇరుగుపొరుగువారు కాదుకదా దేవుడు కూడా పట్టెడన్నం తెచ్చి పెట్టడని రామారావుకి తెలియందికాదు. ఉత్తి పుణ్యానికే ఎవరైనా పైసలిస్తారా?

అది జరగని పని. పిలిచి భోజనం పెట్టే దాతలున్నారా ఈ రోజుల్లో. ఇవేవీ జరగవని రామారావుకి తెలుసు.

ఈ పరిస్థితుల్లో పొట్ట నిండేందుకు పట్టెడన్నం దొరికేదెట్లా? అమ్మ ఎప్పుడూ అనేది కడుపులోకి అన్నం లేకపోతే పస్తులుంటాంగానీ నిజాయితీని వదలకూడదు అని. రామారావుకు ఎన్నెన్నో ఆలోచనలు.


నన్ను నేను పోషించుకోలేనా? నా జీవితాన్ని నేను గడుపుకోలేనా? ఎలా గడుపుకోవాలి? శ్రమించి నిజాయితీగా డబ్బు సంపాదించాలని అమ్మ చెబుతూ ఉండేది. రామారావుకి అమ్మ గుర్తుకు వచ్చింది. చెమటోడ్చి సంపాదించాలి. అంతేకానీ నిజాయితీని వదలుకోకూడదు ఎట్టి

పరిస్థితుల్లోనూ. అమ్మ మాటలు గుర్తుకు వస్తు న్నాయి అతనికి.

కిందటిరోజు లైబ్రరీలో పేపర్లో చదివిన విషయం 'డబ్బులేని లోకం' మరోసారి గుర్తుకు వచ్చింది రామారావుకి.

సాధారణంగా మనమే వస్తువునైనా కొనాలను కుంటే డబ్బిచ్చి కొనుక్కుంటాం. అనవసరమైన వస్తువు కావాలంటే మనవద్ద డబ్బు ఉండాలనేది దీన్నిబట్టి అర్థమవుతుంది.

ఇక్కడే రామారావుకి తాను చరిత్రలో చది విన విషయం కూడా గుర్తుకొచ్చింది. ప్రాచీన కాలంలో మన దగ్గరున్న వస్తువునిచ్చి మనకు



కావాల్సిన వస్తువును మరొకరి దగ్గర నుంచి తీసుకోవడమనేది వస్తు వినిమయ పద్ధతి ఉండేది.

ఇది బాగానే వుంది. డబ్బులుండవలసిన అవసరంలేదు.

అయితే మనం ఇచ్చే వస్తువు అవతలివాళ్లకి అవసరం లేనప్పుడు వాళ్లు మనకు తమవద్దనున్న వస్తువు ఇవ్వరు. మరి అలాంటప్పుడు మనకు ఇబ్బంది కలుగుతుంది.

అప్పుడే డబ్బు అనే వస్తువు మధ్యలోకి వచ్చింది. డబ్బు ద్వారా మనకి కావాల్సిన వస్తువు సంపాదించాలి అనే సాంప్రదాయం సమాజంలో నెలకొంది. రామారావు మనస్సు డబ్బు చుట్టూ తిరగసాగింది.

డబ్బుని అలా వినియోగించకుండా అవతలివాళ్లు చేస్తున్న వాళ్ల పనిలో శారీరకంగా మనం సహాయం చేసి అందుకు ప్రతిఫలంగా పట్టెడన్నం పెట్టమని కోరడంవల్ల డబ్బుతోనే ఆకలి తీర్చుకోగలం అనే సమస్య దూరమవుతుంది. ఇదే సోయిర్స్ థీరీ. ఇది బాగానే వుంది. కానీ మన సహాయంగానీ, మన సలహాగానీ వాళ్లకి అవసరం లేనప్పుడుగానీ లేదా మనకి కావాల్సిన వస్తువు వాళ్ల దగ్గర లేనప్పుడుగానీ లేదా మనకి ఆరోగ్యం బాగోలేక ఏ పనీ చేయలేని పరిస్థితిలో మనం ఉన్నప్పుడో మనకి ఇబ్బంది కలుగుతుంది కదా.

మరి అలాంటప్పుడు సోయిర్స్ చెప్పినట్లుగా డబ్బులేని లోకం ఎలా సాధ్యమవుతుంది?

సరే అదంతా నాకెందుకు. ఇలా ఆలోచిస్తూ కూర్చుంటే నా ఆకలి ఎలా తీరుతుంది?

రామారావు ఆలోచిస్తున్నాడు. అవసరమైన వస్తువు కావాలన్నప్పుడు డబ్బు తప్పనిసరిగా అవసరమవుతుంది. ఇది నిజం. అందుచేత నేను కూడా డబ్బులు పుచ్చుకుని పనులు చేస్తాను అని నిశ్చయించుకుని రామారావు లైబ్రరీ నుంచి ఇంటికి వచ్చేస్తున్నాడు రోడ్డుమీద నుంచి తల వాల్చుకుని.

శెట్టిగారి దుకాణంలోంచి గట్టిగా మాటలు వినిపిస్తుంటే ఆ గొడవ ఏమిటో తెలుసుకునేందుకు రామారావు తన నడక వేగాన్ని తగ్గించడమే కాకుండా ఆ దుకాణం దగ్గర ఆగాడు కూడా.

"నువ్విప్పుడు టౌనుకు వెళ్లి కిరాణా దినుసులు తేలేదనుకో... కొట్లో సరుకులు నిండుకుని బేరం తగ్గిపోతుంది" అంటూ నారాయణశెట్టి కొడుకును గదమాయిస్తూ చెబుతున్నాడు.

శెట్టి కొడుకు ఉలుకూ పలుకూ లేకుండా అలాగే నిల్చున్నాడు. అంతేగానీ తండ్రి చెప్పిన పని చేయడానికి అక్కడ్నుంచి కదల్లేదు ఆ ఉద్దేశ్యం తనకు లేదన్నట్లుగా.

శెట్టిగారు మనోసారి చెప్పినా అతని కొడుకు కిమ్మనకుండా అక్కడే కూర్చున్నాడు.

రామారావు పరిస్థితిని అర్థం చేసుకున్నాడు. ఆయన దగ్గరకు వెళ్లి ఇలా అన్నాడు.

"నేను టౌనుకెళ్లి మీక్కావాల్సిన సామాన్లు తెస్తానండీ. సామాన్ల చీటీ ఇవ్వండి" అంటూ చెయ్యి ముందుకు చాపాడు.

"మీకు ఖాతావున్న హోల్‌సేల్ కొట్టు యజమానికి నేను ఫలానా అని లెటర్ రాసివ్వండి. కావాలంటే ఇదిగో నా ఫోటో. ఆ లెటర్ కింద అతికించండి" అంటూ జేబులో వున్న తన పాస్‌పోర్టు సైజు ఫోటో ఇచ్చాడు రామారావు.

శెట్టిగారికి ఇది బాగానే వుందనిపించింది.

అయినా రామారావు నిజాయితీని గుర్చి శంకించకుండా ఉండలేకపోయాడు. అయితే ఆ భావాన్ని బయటకి కనిపించనీయకుండా శెట్టిగారన్నారు.

"రామారావు! నువ్వేం మాకు తెలియనివాడివి కనుకనా. బాగా తెలిసినవాడివి. నాకేకాదు, ఇక్కడ ఇంతమంది ఉన్నారా వీళ్లందరికీ తెలుసు నువ్వెవ్వరివో. ఈ వూరివాడివి, ఈ వీధివాడివి. అందుచేత నీకు ఈ పని అప్పగిస్తున్నాను. ఈ పనిని చక్కగా చేసుకునిరా. రేపటినుంచి ఈ పని నువ్వే చేద్దువుగానీ. నీకు కూడా ఉపాధిగా వుంటుంది" అని ఆశ కూడా చూపించాడు శెట్టి.


వెదకబోయిన తీగ కాలికి తగిలిందని అనుకున్నాడు రామారావు.

"అలాగేనండి. నన్ను నమ్మండి. నేనెలాంటివాడినో, నా నిజాయితీని రుజువు చేసుకోవడానికి అవకాశమివ్వండి" రామారావు అన్నాడు.


★★★

## సిగరెట్... బహు ప్రమాదకరం

ప్రపంచ దేశాలలో లక్షలాదిమంది మరణాలకు కారణం ధూమపానమేనని బ్రిటన్‌లో ఇటీవల జరిగిన పరిశోధనల సెమినార్ స్పష్టం చేసింది. గ్లాస్కో యూనివర్శిటీకి చెందిన సైంటిస్టుల బృందం ఒక నివేదికను తయారుచేసింది. దీని ప్రకారం పొగ త్రాగడం వలన శరీరంలోని అనేక సున్నిత భాగాలు దెబ్బతిని, అతి వేగంగా నాశనమవుతుందని అధ్యయనాలు వెల్లడించాయి. నేటి యువత ధూమపానాన్ని ఒక ఫ్యాషన్‌గా అనుసరించడం ఆందోళన కలిగించే అంశం.



-యం.లక్ష్మీకాంతమ్మ



సాయంకాలం ఏడుగంటలకల్లా రామారావు శెట్టిగారి కొట్టుముందు ఆగాడు ఆటో నిండుగా సామాన్లతో.

చీటీ ప్రకారం సామాన్లు అప్పగించాడు. శెట్టిగారినడిగి ఆటోవాడికి కిరాయి ఇచ్చాడు.

శెట్టి ఇచ్చిన డబ్బుతో బియ్యం కొనుక్కొని వండుకుని, తనకీ విధంగా ఆధారం చూపించినందుకు భగవంతుడ్ని మనసులోనే ప్రార్థిస్తూ హాయిగా నిద్రపోయాడు రామారావు.

★★★

ఆ నెలలో మిగిలిన రెండువారాలు రామారావే టౌనుకెళ్లి సామాన్లు తెచ్చాడు.

అందుకు కిరాయి కూడా తీసుకున్నాడు. తన జీవితానికి ఇంత చక్కని ఉపాధి కల్పించిన భగవంతుడికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ రామారావు జీవితం గడుపుతున్నాడు.

నారాయణశెట్టికి రామారావుమీద నమ్మకం కుదిరింది. వారం వారం హోల్‌సేల్ షావుకారుకు ఇచ్చే డబ్బు కూడా ఇప్పుడు రామారావు ద్వారానే పంపుతున్నాడు.

అంతేకాదు, తాను తెప్పించే సామాను విలువలో నూటికి ఒక రూపాయి రామారావుకి ఇస్తానని కూడా చెప్పాడు.

నారాయణశెట్టి మాదిరిగానే ఆ ఊళ్ళో వున్న మరో నలుగురైదుగురు షావుకార్లు కూడా రామారావు ద్వారానే తమ దుకాణాలకు అవసరమైన కిరాణా సామాన్లు టౌను నుంచి తెప్పించుకోవడం మొదలుపెట్టారు. అందుకు తగిన ప్రతిఫలాన్ని ఆ షాపు యజమానులు రామారావుకు అందిస్తున్నారు. చాలా తక్కువ కాలంలోనే రామారావు అందరి అభిమానాన్ని చూరగొన్నాడు.

★★★

ఏడాది గడిచింది.

ఇప్పుడు నలభైమంది షావుకార్ల పనులు రామారావు టౌన్‌లో చేస్తూ వస్తున్నాడు.

తన నిజాయితీతో రామారావు అందరి షావుకార్ల మనసుల్ని చూరగొన్నాడు.

అందరి షావుకార్లకి రామారావు ఇప్పుడు తలలో నాలుక. పట్నంలో ఎవరు ఏ పని చెప్పినా కాదనకుండా చేసుకొస్తాడు.

సామాన్లు తెచ్చే రోజున వేన్ బుక్ చేసుకుంటాడు. ఒక దఫాకి పదిహేను మంది షావుకార్ల సామాన్లు తెస్తూ వుంటాడు. అందరి సామాన్లు పేరుపేరునా అప్పగిస్తూ వుంటాడు.

వేన్ కిరాయికని ఆరోజు సామాన్లు ఏయే షావుకార్లవి తెస్తాడో వాళ్ల దగ్గర వసూలు చేస్తాడు.

ఆ కిరాయి మరునాడు వేన్ ఓనర్‌కి అందజేస్తాడు. ఎవ్వరిదగ్గరా ఒక్క రూపాయికి కక్కుర్తి పడడు.

రామారావు ఇప్పుడు కొంత డబ్బు వెనవేసుకున్నాడు అనేకన్నా బాగా సంపాదించాడని చెప్పవచ్చు.

రామారావు నిజాయితీకి నాలుగేళ్లు గడిచాయి. దాంతో రామారావు పూరి ఇల్లు ఓ చిన్న డాబా ఇల్లుగా మారిపోయింది కూడా. నారాయణశెట్టితోసహా షావుకార్లందరూ మంచి మనసుతో ఆనందించారు.


★★★

మరో నాలుగేళ్లు గడిచాయి రామారావు నిజాయితీకి.

"పదహారు వన్నెల మేలిమి బంగారంలాంటి నిర్మలమైన నిజాయితీ నీ జీవితానికి పెట్టుబడిగా అమరిందోయ్ రామారావ్. ఆ పెట్టుబడే ఇవ్వాళ నిన్నీ ఉన్నతమైన స్థితికి తీసుకువచ్చి ఓ ఇంటివాడ్ని కూడా చేసింది. నిజాయితీని నిలుపుకో, నీ జీవిత వ్యాపారాన్ని పెంచుకో. దేవుడు మీ ఉభయులకూ మేలు చేస్తాడు. నీలాంటి నమ్మకమైనవారు వుంటే ఏ వ్యాపారమైనా కళకళలాడుతుంది'' అంటూ తన కాళ్లకి నమస్కరిస్తున్న రామారావు దంపతుల్ని నారాయణశెట్టి ఆశీర్వదించాడు.

ఆయన మాటలకు రామారావు కళ్లు చెమర్చాయి. తన ఎదురుగా అమ్మ ఆశీర్వదిస్తున్నట్లుగా అనిపించింది నిజాయితీతో నిండు నూరేళ్లు బ్రతకమని ఆశీర్వదిస్తున్నట్లుగా.

★



## అభిమానుల రూటే వేరు!

మన దేశంలోనే కాదు, రజనీకాంత్‌కి జపాన్‌లో వీరాభిమానులున్న సంగతి అందరికీ తెలుసు. రజని తాజా చిత్రం 'కుశేలన్' (కథానాయకుడు) విడుదల సందర్భంగా జపాన్‌లోని ఓ చాక్లెట్ కంపెనీ యజమాని రజనీకాంత్ బొమ్మని తమ చాక్లెట్ రేపర్ల మీద ప్రింట్ చేసి విడుదల చేసాట్ట. రజనీపై అతనికున్న అభిమానం అలాంటిది మరి. 'కుశేలన్' చూడ్డానికి వచ్చే ప్రేక్షకులకు ఆ చాక్లెట్లని పంచిపెట్టడం చూస్తే రజనీలాగే అతని అభిమానుల రూటు కూడా వేరే అనిపిస్తోంది కదూ!

